సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 9 । మే । 2023



తునికాకు.. ఏ మేరకు..?

గిరిజనులు వేసవిపంటగా భావించే తునికాకు సేకరణ పాల్వంచ. వైల్డ్‌లైఫ్ డివిజన్లలో చురుకుగా సాగుతోంది.

10లో



'గులాబీ'లో పదవుల సందడి

అధికార పార్టీలోని ద్వితీయ శ్రేణి నేతల్లో నామినేటెడ్‌తోపాటు పార్టీ పరమైన పదవులపై ఆశలు చిగురిస్తున్నాయి.

8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు కొంతమేర పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. రామాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న తిరుకల్యాణోత్సవాలకు సోమవారం పూర్ణాహుతితో ముగింపు పలికారు.

రాముడి భూములకు శాశ్వత పరిష్కారం చూపాలి



రైతుల వాదనలను వింటున్న పాడేరు జాయింట్ కలెక్టర్

భద్రాచలం: ఏపీలోని యటపాక మండలంలోని పురుషోత్తపట్నంలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామివారి భూములకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఆ భూములను రామాలయానికి అప్పజెప్పాలని ఈఓ ఎల్.రమాదేవి పాడేరు జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్‌ను కోరారు. పురుషోత్తపట్నంలోని ఆలయ భూములకు సంబంధించి రైతులతో, ఆలయ సిబ్బందితో యటపాకలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ రమాదేవి ఏపీ రాష్ట్ర హైకోర్టు పిల్ ఉత్తర్వులను అందించి, ఆ ప్రకారం భూములను అప్పగించాలని కోరారు. దేవస్థానం రికార్డుల ప్రకారం 918 ఎకరాలు భూమి ఉందని, కానీ ప్రస్తుతం ఆక్రమణల అనంతరం 889.50 ఎకరాల భూమి ఉందని తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ... దేవస్థానం అధికారులు, రైతులు వాదనలను వినిపించారని, ఈ విషయాలు కలెక్టర్‌కు విన్నవించి మరో వారం రోజుల్లో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. దేవస్థానం తరఫున ఈఈ రవీందర్, ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, సూపరింటెండెంట్‌లు, అర్చకులు, పురుషోత్తపట్నం రైతులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కొత్తగూడెంరూరల్: 2023–2024 విద్యాసంవత్సరానికి బీసీ హాస్టళ్లలో ప్రవేశానికి 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇ.ఇందిరా కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన చేశారు.

పెద్దమ్మతల్లి గుడి దుకాణాల వేలంవాయిదా



పెద్దమ్మతల్లి ఆలయం

పాల్వంచరూరల్: శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద వ్యాపార దుకాణాలకు సోమవారం నిర్వహించిన టెండర్ కమ్ బహిరంగ వేలంపాటకు పాటదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు. గుడి వద్ద కొబ్బరికాయల దుకాణాలు, చీరలను పోగుచేసుకునేందుకు, పూలదండలు విక్రయం, టెంట్‌హౌస్ సామగ్రి సరఫరాకు ఈ నెల 10 నుంచి 11 నెలల కాలానికి లీజు, లైసెన్స్ హక్కులు పొందేందుకు ధర్మకర్తల మండలి సమక్షంలో సోమవారం వేలంపాట నిర్వహించారు. సరైన హెచ్చుపాట రానందున వాయిదా వేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కనీస రక్షణ కరువు..

నిబంధనలు పాటించని యజమానులు

- పెద్దమ్మతల్లి ఆలయం వద్ద 30 పైగా ఫంక్షన్ హాళ్లు
- అమ్మవారి చెంతన అధిక సంఖ్యలో శుభకార్యాలు
- వాహనాల రద్దీతో హైవేపై తరచుగా ట్రాఫిక్ జామ్



నిబంధనలు పాటించకుండా నిర్మించిన ఫంక్షన్‌హాళ్లు, ఇరుకు గల్లీల్లో రాకపోకలకు తప్పనిపాట్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పెద్దమ్మగుడి చుట్టూ వెలిసిన ఫంక్షన్ హాళ్లలో నియమ నిబంధనలు పాటించడంలేదు. సందు గొందుల్లో కనీస సౌకర్యాలు లేకుండా నిర్వహిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ విభాగాలు కళ్లు తెరిచి చోద్యం చూస్తున్నాయి. పాల్వంచ మండలం కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గమ్మ తల్లిని కొత్తగూడెం, పాల్వంచ ప్రజలతోపాటు ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు పరిసర ప్రాంతాలవారూ తమ ఇంటి ఇలవేల్పుగా భావిస్తారు. కొత్త వాహనం కొనుగోలు చేసేవారు, పరీక్షలు రాయబోయే విద్యార్థులు, ఇంటర్వ్యూలకు హాజరయ్యే ఉద్యోగార్థులు తల్లి దీవెనల కోసం వస్తుంటారు. ఫలితంగా రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతోంది. పుట్టినరోజు మొదలు పెళ్లి వరకు అన్ని రకాల శుభకార్యాలు ఇక్కడ చేసేందుకు భక్తులు ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలో పెద్దమ్మగుడి కొలువైన కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల్లో ముప్పెక్కి పైగా ఫంక్షన్ హాళ్లు వెలిశాయి. ఇందులో తొంభై శాతం ఫంక్షన్ హాళ్లలో కనీస భద్రతా ప్రమాణాలను పాటించడం లేదు.

అగ్నిమాపక నిబంధనలు పాటించరు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫంక్షన్ హాల్ సీటింగ్ సామర్థ్యానికి తగ్గట్టుగా పార్కింగ్ ప్లేస్ ఉండాలి. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణం జరగాలి. మంటలను ఆర్పే పరికరాలు అందుబాటులో ఉండాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచాలి. సమీపంలోని విద్యుత్ తీగెల నుంచి రక్షణ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పోలీస్ రూల్స్ ప్రకారం పది మందికి మించి వచ్చి పోయే ప్రదేశాల్లో కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఇందులో ఏ ఒక్క నిబంధన ఇక్కడ అమలుకు నోచుకోవడం లేదు. ఇరుకు గల్లీల్లో రక్షణ, భద్రతా ఏర్పాట్లు లేకుండా కనీసం పార్కింగ్ ప్లేస్ ఇవ్వకుండా ఫంక్షన్ హాళ్లను నిర్వహిస్తున్నారు. సరైన బాత్‌రూమ్స్, టాయిలెట్లు కూడా లేవు. నిర్వాహకులు మాత్రం భక్తుల సెంటిమెంట్‌ను క్యాష్ చేసుకుంటూ తమ బ్యాంక్ బ్యాలెన్స్ పెంచుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలు చేపడుతుంటే రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపడుతున్నారా ? లేదా అనే అంశాన్ని ఫైర్ డిపార్ట్‌మెంట్ తనిఖీలు చేయడం ఎప్పుడో మానేసింది. సీసీ కెమెరాలు లేకపోయినా, పార్కింగ్ జాడ లేక ట్రాఫిక్ చిక్కులు వస్తున్నా పోలీసు శాఖ పట్టించుకోవడం లేదు. ఫంక్షన్ హాళ్లను ఆనుకునే కరెంటు తీగలు వెళ్తున్నాయి. ఆ తీగలకు ఇన్సులేషన్ పైపులు అమర్చకపోయినా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలేదు.

ఐదేళ్లుగా సాగుతున్న ప్రభుత్వ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం

ప్రైవేటు ఫంక్షన్ హాళ్ల సంగతి ఇలా ఉంటే విశాలమైన ప్రాంగణంలో, సమృద్ధిగా పార్కింగ్ స్థలం ఉండి, ప్రధాన రహదారికి కొంచెం దూరంగా ప్రభుత్వం రెండు ఫంక్షన్ హాళ్ల నిర్మాణం చేపట్టింది. నిర్మాణ పనులు మొదలై ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రైవేటు ఫంక్షన్ హాళ్ల యజమానుల లాబీయింగ్ కారణంగానే ప్రభుత్వ ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనులు అటకెక్కాయనే విమర్శలు ఉన్నాయి. ఫంక్షన్ హాళ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నా తంచనుగా మాముళ్లు ముడుతుండటంతో ఏ ఒక్క ప్రభుత్వ విభాగం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. అన్నింటికంటే ముందు ఏజెన్సీ పరిధిలోకి వచ్చే కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల పరిధిలో ఫంక్షన్ హాళ్ల నిర్మాణమే ప్రాథమికంగా నిబంధనలకు విరుద్ధం. అయినప్పటికీ భారీ భవంతులు వెలిసినా చూస్తూ మిన్నకుండి పోతున్నారు.



పెద్దమ్మతల్లి ఆలయం వద్ద జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం

ఆదివారం, పర్వదినాలు, మంచి ముహూర్తాలు వచ్చాయంటే చాలు పెద్దమ్మగుడి పరిసర ప్రాంతాలు భక్తులు, వారిని తీసుకు వచ్చిన వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. ఇక్కడ ఏ ఫంక్షన్ హాల్‌కు తమదంటూ పార్కింగ్ ప్లేస్ అందుబాటులో లేదు. దీంతో అమ్మవారి ఆలయానికి అటు ఇటు రోడ్డుకు ఇరువైపులా సుమారు అర కిలోమీటరు వరకు విజయవాడ–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. ఫలితంగా హైవేపై ట్రాఫిక్ జామ్ అవుతోంది. మరికొందరు ఇరుకు గల్లీల్లో వాహనాలు ఆపుతున్నారు. ఫలితంగా ఈ గల్లీల్లో రెండు వాహనాలు ఎదురుపడితే ఏ ఒక్క బండి ముందుకు కదిలించే పరిస్థితి లేకుండా పోతోంది.

ప్రజావాణికి విశేష స్పందన



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఫిర్యాదులపై కలెక్టర్ అనుదీప్ సత్వరమే స్పందిస్తుండటంతో ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తన పిల్లలు బ్యాంకు రుణం చెల్లించడం లేదని తనకు వచ్చే పింఛన్‌ను ఏపీజీవీబీ అధికారులు రికవరీ చేస్తున్నారని అశ్వారావుపేటకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేయగా.. బ్యాంకు మేనేజర్‌కు నోటీసు జారీ చేయాలని ఎల్‌బీఎంను కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు గ్రామానికి చెందిన వి.వసంతరావు, మరికొందరు గిరిజన రైతులు అన్నపురెడ్డిపల్లి మండలం అన్నదైవం రెవెన్యూలోని ప్రభుత్వ సీలింగ్ భూములను 30 సంవత్సరాల నుంచి 81 మంది సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, సాగు చేస్తున్న ప్రభుత్వ సీలింగ్ భూములకు అసైన్డ్‌మెంట్ పట్టాలు ఇప్పించాలని కోరగా.. దరఖాస్తును తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారి గూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ రాజశేఖర్ మల్లాయిగూడెం, పండువారిగూడెం గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేపట్టాలని విన్నవించగా.. దరఖాస్తును జిల్లా సంక్షేమాధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జవాబుదారీగా పనిచేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజ లకు జవాబుదారీగా పనిచేయాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలో వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. క్షేత్రపర్యటనలు నిర్వహించే సిబ్బంది టూర్‌డైరీల నివేదికలను అందజేయాలని చెప్పారు. రెండో విడత గొర్రెల పంపిణీకి లబ్ధిదారులు తమ వాటాను చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. 106 సొసైటీల్లోని 3,487 మందికి గొర్రెల పంపిణీ లక్ష్యం కాగా 3,461 మంది లబ్ధిదారుల విచారణ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 26 మంది లబ్ధిదారుల విచారణ ఈనెల 10వ తేదీ వరకు పూర్తి చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో 1,570 మంది లబ్ధిదారుల ధ్రువీకరణ వివరాలు ఆన్‌లైన్ చేశఋమని, మిగిలిన 1,917 మంది లబ్ధిదారులవి ఈ నెల 13 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. 1,568 మంది లబ్ధిదారులు తమ వాటాను చెల్లించారని, మిగిలిన 1,919 మంది చెల్లింపు ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలని అన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. గ్రామ పంచాయితీలలో రీడింగ్ రూంల ఏర్పాటు ప్రక్రియను విద్యాశాఖాధికారులు వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్

గుండాల మండలానికి చెందిన దుగ్గం రాంబాబు 2008, జనవరి 21న పోలీస్ ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టుల చేతిలో హత్యకు గురయ్యాడు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ రూ.10 లక్షల చెక్కును రాంబాబు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు భార్య రేవతి మాట్లాడుతూ తాము కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, తమకు ప్రభుత్వం తరఫున ఆర్థిసాయం అందజేయడం ఎంతో ఆసరాగా ఉంటుందని అన్నారు. అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, రాంబాబు తల్లి మల్లమ్మ, కుమారుడు కిషోర్, కుమార్తె ప్రియ పాల్గొన్నారు.

యూడైస్‌లో నిక్షిప్తం చేయాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు 1,703 ఉండగా, 1,73,093 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వివరాలన్నీ తెలంగాణ రాష్ట్ర వెబ్‌సైట్ స్టూడెంట్ ఇన్ఫో పోర్టల్‌లో పొందుపరిచి ఉన్నాయని, ఇక నుంచి వారి వివరాలు యూడైస్ వెబ్‌సైట్‌లో మాత్రమే తీసుకోవాలని జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న స్టూడెంట్ ఇన్ఫో పోర్టల్‌లో నిక్షిప్తమై ఉన్న వివరాల్లో చాలా వరకు విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్లు తప్పుగా నమోదయ్యాయని వివరించారు. స్కాలర్‌షిప్‌లు, భవిష్యత్‌లో విద్యార్థుల టీసీలు, స్టడీ సర్టిఫికెట్ల కోసం వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలనే ప్రామాణికంగా తీసుకుంటారని తెలిపారు. నష్టం జరగకుండా తల్లిదండ్రులు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్ విద్యార్థుల వివరాలు సరి చూసి అప్డేట్ చేయాలని కోరారు. ఈనెల 15వ తేదీ లోగా అన్ని మండలాల ఎంఐఎస్, సీఆర్పీల సహకారంతో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, సందేహాలు ఉంటే జిల్లా కార్యాలయ ఏఎస్ఓ ఎన్.సతీష్‌కుమార్‌ను సంప్రదించాలని కోరారు.

జేపీఎస్‌లకు ప్రభుత్వం డెడ్‌లైన్

- నేడు విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ
- లేనిపక్షంలో తొలగిస్తామని హెచ్చరిక



సమ్మె చేస్తున్న జేపీఎస్‌లు

చుంచుపల్లి: సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శు(జేపీఎస్)లు విధుల్లో చేరాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, నాలుగేళ్ల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గత నెల 28 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. 2019, ఏప్రిల్ 12న జేపీఎస్‌లను నియమించగా, గత నెల 12తో ప్రొబేషనరీ కాలం ముగిసింది. దీంతో తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించుకున్నారు. అనంతరం సహాయనిరాకరణతో పాటు పలు విధాలుగా నిరసనలు తెలిపారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో గత 28 నుంచి సమ్మెబాట పట్టారు. సమ్మెకు అధికార పార్టీ తప్ప అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు అండగా నిలిచి సంఘీభావం తెలిపాయి.

నేటి సాయంత్రంలోగా విధుల్లో చేరాలి: కలెక్టర్ అనుదీప్

జేపీఎస్‌లు మంగళవారం సాయంత్రంలోపు విధుల్లో చేరాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా జిల్లాలకు ఆదేశాలు జారీ చేయగా, కలెక్టర్ అనుదీప్ సోమవారం వెల్లడించారు. సోమవారం రాత్రి జేపీఎస్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటలలోగా తిరిగి విధుల్లో చేరాలని సూచించారు. లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

స్తంభించిన సేవలు

పదకొండు రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తుండగా గ్రామాల్లో సేవలు స్తంభించాయి. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ, ఎంపీఓ, సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతోపాటు పలువురికి అదనపు బాధ్యతలు అప్పగించినా గ్రామాల్లో సేవలు మెరుగుపడటం లేదు. కొన్నిచోట్ల అదనపు బాధ్యతలు అప్పగించిన వారు సైతం జేపీఎస్‌ల విధులను చేపట్టడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికుల పనులపై పర్యవేక్షణ కొరవడింది. అటు సర్పంచులు సైతం జేపీఎస్‌లకు మద్దతుగా నిలుస్తుండటంతో పంచాయతీ పాలనపై అంతగా ఆసక్తి చూపడం లేదు. ప్రతినెల అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు కార్యదర్శుల ద్వారానే పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంటుంది. సమ్మె వల్ల కొన్నిచోట్ల పింఛన్ల పంపిణీ ఆగిపోయింది. ఉపాధి హామీ పనులకు సంబంధించి రికార్డులన్నీ జేపీఎస్‌ల పరిధిలోనే ఉన్నాయి. ఆ పనులు కూడా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. గ్రామాల్లో జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాల మంజూరు, ఇంటి పన్నుల వసూళ్లు వంటివి పూర్తిగా నిలిచిపోయాయి. హరిత నర్సరీల్లో మొక్కల పెంపకం, కూలీల పర్యవేక్షణ, మొక్కలకు నీళ్లు పోయడం వంటి పనులన్నీ పడకేశాయి. గ్రామాల్లో ఆరోగ్యపరమైన అవగాహన కార్యక్రమాలకు జేపీఎస్‌లు చేదోడు వాదోడుగా ఉంటారు. ప్రస్తుతం వారు సమ్మెలో ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

కొనుగోళ్లలో ఇంకా జాప్యం

- ధాన్యం అమ్ముకునేందుకు అన్నదాత ఎదురుచూపులు
- గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఎదుట రెడ్డిగూడెం రైతుల ఆవేదన
- అకాల వర్షం నుంచి కాపాడుకునేందుకు నానాపాట్లు



ప్లకార్డులతో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడంలేదు. దీంతో అన్నదాతలకు ఇక్కట్లు తప్పడంలేదు. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలు అక్కడక్కడ పరిష్కారమవుతున్నా చాలాచోట్ల ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యంలో 17 శాతం కంటే తక్కువ తేమ శాతం ఉండాలనే నిబంధన ప్రకారం రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకోవడం కోసం పడరానిపాట్లు పడుతున్నారు. అకాల వర్షాలతో నిత్యం ఆందోళన చెందుతున్నారు. పాల్వంచ మండలం ప్రభాతనగర్ (రెడ్డిగూడెం) రైతులు సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఎదుట తమ గోడు వెలిబుచ్చారు. తొలుత కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని, తమకు న్యాయం చేయాలని ప్లకార్డులతో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అకాల వర్షాలతో ధాన్యం ఆరబెట్టుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందారు. కొనుగోళ్లు ప్రారంభించక ముందే మిల్లర్లు బస్తాకు 10 కేజీల తరుగు అడుగుతున్నారని వాపోయారు. కొనుగోళ్లలో జాప్యం ప్రైవేటు వ్యాపారులకు మేలు చేసినట్లవుతోంది. స్పాట్ పేమెంట్ అని చెబుతూ క్వింటాల్‌కు రూ.1300 చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,060, రూ.2,040 ఉండగా, రైతులు క్వింటాకు రూ.700 చొప్పున నష్టపోవాల్సి వస్తోంది. జిల్లాలో 136 కేంద్రాలు ప్రారంభించిన అధికారులు మొత్తం 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యానికి ఇప్పటి వరకు 6వేల టన్నులు మాత్రమే సేకరించారు. పక్షం రోజుల్లో ఇంత తక్కువ సేకరించడమేమిటనే ప్రశ్న తలెత్తుతోంది. వారంరోజుల క్రితం ఇదే పాల్వంచ మండలంలోని సోములగూడెంలో కొనుగోళ్లు జరగడం లేదనే ఫిర్యాదుతో డీసీఓ స్వయంగా పరిశీలించి ప్రారంభింపచేశారు. ఇప్పుడు ప్రభాతనగర్, రెడ్డి గూడెంలలో ఇదే పరిస్థితి నెలకొంది. రైతులు చైతన్యంతో ఉండే ప్రాంతాల్లో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభిస్తున్నారని, మిగతా చోట్ల జాప్యం చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సహకారశాఖ, పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థల ఆధ్వర్యంలో జరిగే కొనుగోళ్ల ప్రక్రియలో సమన్వయం కొరవడిన కారణంగా సమస్య ఏర్పడుతుందనే విమర్శలు కూడా ఉన్నాయి. కాగా ప్రజావాణిలో ప్రభాతనగర్ రైతుల ఫిర్యాదుతో స్పందించిన కలెక్టర్ సమస్యలు పరిష్కరించాలని పాల్వంచ తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో తహసీల్దార్ ఆ గ్రామానికి వెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోళ్లు ప్రారంభించాలి



ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి. అకాల వర్షాలతో ధాన్యం ఎక్కడ తడుస్తుందోనని ఆందోళన చెందుతున్నాం. కలెక్టర్‌గారు స్పందించి మాకు న్యాయం చేయాలి.

–కళ్లెం వీరారెడ్డి, రైతు, రెడ్డిగూడెం

అకాల వర్షంతో ఇబ్బంది



కోతల తర్వాత ధాన్యం ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నాం. వానలకు ధాన్యం తడిసి పోతున్నాయి. రేయింబవళ్లు కేంద్రాల్లో కాపలా కాస్తున్నాం. కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి.

–బద్దం దేవేందర్ రెడ్డి, రెడ్డిగూడెం

మణిపూర్ నుంచి సురక్షితంగా..

నేడు ఇంటికి చేరుకోనున్న రాంనగర్ తండా విద్యార్థి

ఏన్కూరు: మణిపూర్ ఎన్ఐటీలో బీటెక్ చదువుతున్న ఏన్కూరు మండలం రాంనగర్ తండాకు చెందిన విద్యార్థి హర్షవర్ధన్.. అక్కడి అంతర్గత యుద్ధం కారణంగా ఇబ్బంది పడ్డాడు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సోమవారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నాడు. వివరాలిలా.. హర్షవర్ధన్ మణిపూర్‌లో చదువుతుండగా అక్కడ ఈనెల 2 నుంచి 5 వరకు రెండు సామాజిక వర్గాల మధ్య అంతర్గత అల్లర్లు జరిగాయి. దీంతో విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లిపోవాలని కళాశాల యాజమాన్యం సూచించింది. ఈ క్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేయగా.. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులను స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు చేపట్టాయి. ఇలా విద్యార్థులంతా శనివారం ఇంఫాల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. అయితే హర్షవర్ధన్ ఎక్కాల్సిన విమానం అప్పటికే వెళ్లిపోయింది. దీంతో సైనికులు ఇచ్చిన ఆహారం తింటూ ఒక రోజంతా ఎయిర్‌పోర్ట్‌లోనే గడిపాడు. ఈ విషయాన్ని సూర్యాపేటకు చెందిన తన మిత్రులకు ఫోన్ చేసి చెప్పగా.. వారు ఒక మేడమ్ ద్వారా విమానం టికెట్ పంపించారు. ఆయన ఢిల్లీ చేరుకోగానే తెలంగాణ భవన్ అధికారులు అక్కడికి తీసుకెళ్లి అవసరమైన ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి సోమవారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్న హర్షవర్ధన్ మంగళవారం ఉదయం రాంనగర్ తండాకు చేరుకోనున్నాడు. హైదరాబాద్ నుంచి హర్షవర్ధన్ ఫోన్‌లో మాట్లాడుతూ... తాగునీటిలో విషం కలిపారని, మా హాస్టల్‌కు 100 మీటర్ల దూరంలో ఇళ్లు తగులబెట్టారని తెలిపారు. కనిపిస్తే కాల్చివేత వంటి ఆంక్షలు విధించారు. ఆ తర్వాత హాస్టల్‌లో బియ్యం అయిపోయాయని చెప్పారు. కనీసం తాగునీరు కూడా లేదని పేర్కొన్నాడు.

క్లుప్తంగా

దీక్షలో సొమ్మసిల్లిన వీఓఏ



చికిత్స పొందుతున్న ఉమాదేవి

బూర్గంపాడు: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఐకేపీ వీఓఏలు చేస్తున్న దీక్షలు 22వ రోజుకు చేరుకున్నాయి. కాగా, దీక్షా శిబిరం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానిక గ్రామదీపిక ఉమాదేవి సోమవారం ఎండతీవ్రతకు సొమ్మసిల్లి పడిపోయింది. మిగతా వీఓఏలు ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యసేవలను అందించారు.

సరైన పత్రాలు లేని ఆటోలు సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ స్వర్ణలత

బూర్గంపాడు: సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న ఆరు ఆటోలను సోమవారం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత సీజ్ చేశారు. బూర్గంపాడు వద్ద భద్రాచలం టీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్ రామారావుతో కలిసి ఆమె వాహనాలను తనిఖీ చేశారు. 72 వాహనాలను తనిఖీ చేయగా అందులో ఆరు ఆటోలకు సరైన పత్రాలు లేవని తేలింది. ఈ ఆరు ఆటోలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నట్లు ఎంవీఐ తెలిపారు. తనిఖీల్లో ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ గౌతమి, సూపర్‌వైజర్ వీరవెంకన్న పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

దుమ్ముగూడెం: మండలంలోని వెంకట్రాంపురం గ్రామంలోని గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు ఆదివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. కొంతకాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా గోదావరి నుంచి ఇసుక తరలిస్తుండగా అధికారులు నిఘా ఏర్పాటు చేసి ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని రెవెన్యూ కార్యాలయంలోకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



బేబీశాలిని (ఫైల్)

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద సోమవారం ఉదయం ద్విచక్రవాహనాన్ని డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లకావత్ బేబీ శాలిని (33) అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం.. బూర్గంపాడు మండలంలోని ఇరవెండి గ్రామానికి చెందిన లకావత్ శ్యామ్ అతడి బేబీశాలిని తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవా రం కూడా తాపీపని నిమిత్తం ద్విచక్రవాహనంపై భద్రాచలం వెళ్తున్నారు. బ్రిడ్జి దాటిన తరువాత ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద తన వాహన వేగం తగ్గించా డు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ అదుపుతప్పి శ్యామ్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ క్రమంలో బేబీశాలిని అక్కడికక్క డే మృతిచెందగా, శ్యామ్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అనంతరం డీసీఎం వాహనాన్ని పోలీసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ గౌతమ్‌గొడజయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రైవేట్ బస్సుకు తప్పిన ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు

సత్తుపల్లిటౌన్: ప్రయాణికులతో వస్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు 40 మంది ప్రయాణికులతో వెళ్తున్న స్లీపర్ క్లాస్ ప్రైవేట్ బస్సు సత్తుపల్లిలోని ఎస్‌బీఐ ఎదురుగా ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో బస్సు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. కానీ, బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయలు కాలేదు. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

'గులాబీ'లో పదవుల సందడి

- నామినేటెడ్, పార్టీ పదవుల భర్తీపై జోరుగా చర్చ
- ఉమ్మడి జిల్లాలో ఖాళీగా పలు నామినేటెడ్ పోస్టులు
- మంత్రి ప్రకటనతో ద్వితీయ శ్రేణి నేతల్లో హడావుడి
- నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: అధికార పార్టీలోని ద్వితీయ శ్రేణి నేతల్లో నామినేటెడ్‌తో పాటు పార్టీ పరమైన పదవులపై ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆశావహులు రంగంలోకి దిగుతున్నారు. తమకున్న మార్గాల ద్వారా నామినేటెడ్ పదవిని చేపట్టేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. మూడు రోజుల క్రితం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం నగరంలో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఇద్దరు నేతలకు మంచి పదవులు వస్తాయని చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నామినేటెడ్, పార్టీ పరమైన పోస్టుల భర్తీ ఉంటుందనే చర్చ సాగుతోంది.

మంత్రి పువ్వాడ ప్రకటనతో..

ఇటీవల ఓ కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ పదవుల అంశం ప్రస్తావించారు. పార్టీ నేతలు ఆర్‌జేసీ కృష్ణ, కమర్తపు మురళిని మంచి పదవులు వరిస్తాయని వ్యాఖ్యానించారు. దీంతో వీరికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు వస్తాయా.. లేక జిల్లా స్థాయిలో పార్టీ పరమైన పదవులు ఉంటాయా..? అనే చర్చ ఊపందుకుంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఉమ్మడి జిల్లాను నాలుగు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు వరించాయి. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా పిడమర్తి రవి, ట్రికార్ చైర్మన్‌గా తాటి వెంకటేశ్వర్లు, తెలంగాణ పారిశ్రామికాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా షేక్ బుడాన్‌బేగ్ పనిచేశారు. ప్రస్తుతం కొండబాల కోటేశ్వరరావు తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి ఉమ్మడి జిల్లా నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు వరించనున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా మంత్రి పువ్వాడ అనుంగు నేతలు ఆర్‌జేసీ కృష్ణ, కమర్తపు మురళికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు దక్కుతాయనే ప్రచారం ఉంది. వీరితోపాటు మరికొందరు నేతలు కూడా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.

వ్యవసాయ, దేవాలయ కమిటీలపై కసరత్తు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీల ఏర్పాటు జరుగుతూ వస్తోంది. ప్రస్తుతం సత్తుపల్లి, మద్దులపల్లి, ఏన్కూరు, మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్, డైరెక్టర్ల నియామకం చేపట్టాల్సి ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ఉన్న భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గాన్ని రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ నియమించలేదు. ప్రస్తుతం ఈ కమిటీ నియామకం చేపట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయానికి పాలక మండలి నియామకం జరగలేదు. ఖమ్మం జిల్లాలో 84 దేవాలయాలు ఉండగా.. 37 దేవాలయాలకు పాలక మండళ్లను నియమిస్తుంటారు. ఇందులో ప్రస్తుతం 17 ఆలయాలకు పాలక మండళ్ల నియామకం చేపట్టాల్సి ఉంది. ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ ఖాళీగా ఉన్న కమిటీలను భర్తీ చేస్తారనే ప్రచారం బీఆర్‌ఎస్‌లో జోరుగా సాగుతోంది.

రంగంలోకి ఆశావహులు..

నామినేటెడ్ పదవుల అంశం తెరపైకి రావడంతో బీఆర్‌ఎస్‌లోని ఆశావహులు రంగంలోకి దిగారు. పదవులను దక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. బీఆర్‌ఎస్‌లో పదవులను ఆశిస్తున్న వారి సంఖ్య అధికంగానే ఉంది. పదవులు ఆశిస్తున్న ద్వితీయ శ్రేణి నేతలు ఈసారి గట్టి ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఉద్యమ సమయంలో పనిచేసిన నేతలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు అనేకమంది ఉన్నారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. ప్రజలతో తమకున్న సత్సంబంధాలు, పార్టీకి అందించిన సేవలను ముఖ్య నేతలకు వివరించి ఎలాగైనా పదవి దక్కించుకోవాలనే ఆలోచనతో ముందడుగు వేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని శాసనసభ్యులతోపాటు పార్టీలోని ముఖ్య నేతలను ఇప్పటికే కొందరు కలిసి తమకు పదవి ఇప్పించాలని అభ్యర్థిస్తున్నట్లు తెలుస్తోంది. నామినేటెడ్ పదవులు దక్కని వారిని జిల్లా స్థాయిలో ఉండే పార్టీ పర పదవులతో సంతృప్తి పరిచే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

'మనబడి' కాంట్రాక్టర్లపై చర్యలు

24 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్



సమావేశానికి హాజరైన అధికారులు, హెచ్‌ఎంలు, కాంట్రాక్టర్లు

పాల్వంచరూరల్: మన ఊరు–మన బడి కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించి పనులు పూర్తిచేయని కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని కలెక్టర్ అనుదీప్ హెచ్చరించారు. పనులు నిర్దేశించిన గడువులో పూర్తి చేయని కారణంగా కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని, 24మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని డీఈఓతోపాటు సంబంధిత ఈఈని ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలో పాల్వంచ మండలంలో మన ఊరు–మనబడి కింద ఎంపికచేసిన 24 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఒక్క పాఠశాలలో కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్ల అలసత్వం, ప్రధానోపాధ్యాయుల బాధ్యతారాహిత్యం కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు పాల్వంచ మండలంలో జరిగిన పనుల్లో రూ.1.5 కోట్లకు అంచనాలు వచ్చాయని తెలిపారు. జూన్ మొదటివారంలోగా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులందరిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, పాల్వంచ మండల విద్యాశాఖ అధికారి శ్రీరామూర్తి, టీఎస్‌ఈ డబ్ల్యూఐడీసీ ఈఈ నాగేషు, 24 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంట్రాక్టర్లు, ఏఈలు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో సీట్లు

అవకాశం సద్వినియోగం చేసుకోండి: ప్రిన్సిపాల్

రఘునాథపాలెం: మండలంలోని కోయచెలక క్రాస్‌రోడ్‌లో ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల బాలికలు–1లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 5, 6, 8 తరగతుల్లో పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నాయని, ఆసక్తి గల మైనారిటీ విద్యార్థినుల తల్లిదండ్రులు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల సమయంలో పాఠశాలలో సంప్రదించి అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ అబీద సల్మా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత విద్య, భోజనం, వసతితో పాటు నోటుబుక్స్, టెక్ట్ బుక్స్, మూడు జతల యూనిఫాం ఇస్తారని పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం 7331170860, 8317682972, 9492870330 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సంపత్‌నగర్‌లో వ్యక్తి దారుణ హత్య



జానకీరాములు (ఫైల్)



హత్య జరిగిన చోట రక్త నమూనాలు సేకరిస్తున్న పోలీసులు

టేకులపల్లి: మండలంలోని సంపత్‌నగర్‌లో ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. బోడు ఎస్‌ఐ రంజిత్‌కుమార్ కథనం ప్రకారం.. సంపత్‌నగర్ ఆశ్రమ పాఠశాల సమీపంలో పాయం రామయ్య ఇటీవల చనిపోవడంతో సోమ వారం కర్మలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో వంటలకు గాను మేకలను కోసేందుకు ఇదే గ్రామానికి చెందిన నిమ్మనిగంటి వెంకన్నను పిలిచారు. వంటలు పూర్తయిన తరువాత ఇదే గ్రామానికి చెందిన సన్నిహితుడు గోళ్ల జానకీరాములు(55) అక్కడికి రావడంతో ఇద్దరు కలిసి మాట్లాడుకుంటూ భోజనం చేసి బయటకు వెళ్లారు. కొద్దిసేపటికే ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన వెంకన్న తన వద్ద ఉన్న మేకలు కోసిన పెద్ద కత్తి తీసుకుని జానకీరాములు గుండెపై గట్టిగా పొడిచి, హుటాహుటిన వెళ్లి పోలీసులకు లొంగిపోయాడు. తీవ్ర గాయాలపాలైన జానకీరాములును స్థానికులు కొత్తగూడెం తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. ఘటనా స్థలానికి టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, బోడు ఎస్‌ఐ రంజిత్‌కుమార్ చేరుకుని వివరాలు నమోదు చేశారు.

పాతకక్షల నేపథ్యంలోనే..

సంపత్‌నగర్‌లో జరిగిన హత్య పాత కక్షల నేపథ్యంలోనే జరిగిందని, కొడుకు కోసం తండ్రి ప్రతీకారం తీర్చుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. మృతుడు జానకీరాములు కుమారుడు హరీశ్, నిందితుడు నిమ్మనిగంటి వెంకన్న కుమారుడు నవీన్ ఇద్దరూ స్నేహితులు. సుమారు ఏడాది కిందట ట్రాక్టర్‌పై ఇసుక రవాణా చేసేందుకు నవీన్‌ను హరీశ్ తీసుకుని వచ్చాడు. చుక్కాలబోడు వద్ద ఇసుక ట్రాక్టర్ ప్రమాదం జరిగి నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆనాటి నుంచి తన కుమారుడి మృతికి జానకీరాములు, హరీశ్‌లే కారణమని వారిపై కక్ష పెంచుకున్నాడని, ఈ నేపథ్యంలోనే సోమవారం కర్మల కార్యక్రమానికి వచ్చిన జానకీరాములును హత్య చేసి ప్రతీకారం తీర్చుకుని ఉంటాడని స్థానికులు చర్చించుకుంటున్నారు.

వెంకటరెడ్డి మృతికి సంతాపం



మౌనం పాటిస్తున్న లాయర్లు

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టుతోపాటు హైదరాబాద్‌లో అడ్మినిస్ట్రేటివ్ విభాగం రిటైర్డ్ చైర్మన్ వెంకటరెడ్డి సంతాప సభను సోమవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్ మక్కడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లాయర్లు వెంకటరెడ్డికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీవీకే మనోహర్‌రావు, కటికం పుల్లయ్య, ఏపూరి బాబూరావు, దుంద్ర రమేశ్, రావిలాల రామారావు, కాసాని రమేశ్, సంతోష్‌లాల్ సాహూ, జీకే అన్నపూర్ణ, వెలగల నాగిరెడ్డి, జె.పద్మానాభరావు, సింగు ఉపేందర్, ఎరపాటి కృష్ణ, టి.సత్యనారాయణ, ఎస్‌వీ రాజేశ్, అంబటి రమేశ్, వి.రామకృష్ణ, పాతూరి విఠల్, టి.వెంకటేశ్వర్లు, సతీశ్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వసూళ్లు?

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో పలు విభాగాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన ఓ ముఠా రామాలయంలోని ఓ ఉద్యోగితో దందాకు తెరలేపినట్లు కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. కాగా, దీనిపై ఆలయ ఈఓ రమాదేవిని వివరణ కోరగా, ఆ ప్రచారం తన దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేస్తామని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు నోటిఫికేషన్ ప్రకారం భర్తీ చేస్తారని పేర్కొన్నారు.

దుకాణాన్ని కూల్చేశారంటూ ఆందోళన

రోడ్డుపై కూర్చోవడంతో నిలిచిన వాహనాలు



ఆందోళన చేస్తున్న మీరాతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

కొణిజర్ల: కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న దుకాణాన్ని ఆదివారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా కూలగొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఓ వ్యక్తి కుటుంబ సభ్యులతో సహా రోడ్డుపై బైఠాయించాడు. ఈ ఘటన మండలంలోని తనికెళ్లలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జె.శంకర్‌రావు, స్థానికుల కథనం ప్రకారం.. తనికెళ్లకు చెందిన బి.మీరా స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి సుమారు 100 మందికి పైగా వచ్చి తమపై దాడి చేసి దుకాణాన్ని ధ్వంసం చేశారని, డోజర్‌ల సాయంతో దుకాణాన్ని కూల్చివేసి విలువైన వస్తువులన్నీ ఎత్తుకెళ్లారని తెలిపాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సోమవారం ఉదయం దుకాణం వద్ద రోడ్డుపై కుటుంబసభ్యులతో కలిసి బైఠాయించి ఆందోళన నిర్వహించాడు. ఈ సందర్భంగా రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచి పోయాయి. ఎస్‌ఐ శంకరరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి సరైన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించాడు. దీనిపై ఎస్‌ఐ శంకరరావు మాట్లాడుతూ సదరు దుకాణం ఏర్పాటు చేసిన భూమికి సంబంధించిన వివాదం కోర్టులో నడుస్తోందని, దుకాణాన్ని ధ్వంసం చేసిన విషయంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

బాలుడి వైద్యానికి దాతల చేయూత



నగదు అందిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు స్వామినాయక్, ప్రసన్నరాణి దంపతులు

సాక్షి ఎఫెక్ట్..

పెనుబల్లి: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న బాలుడి వైద్యానికి దాతల చేయూత కొనసాగుతోంది. మండలంలోని గంగదేవిపాడు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు సానిక చెన్నారావు పెద్ద కుమారుడు అభిషేక్ బ్రెయిన్ ట్యూమర్‌తో మృతి చెందగా చిన్నకుమారుడు కృష్టాఫర్ కూడా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. చికిత్సకు డబ్బులు లేక దాతల సహకారం కోసం ఎదురు చూస్తుండటంతో ఏప్రిల్ 10న 'సాక్షి'దినపత్రికలో 'మా బిడ్డకు బతుకును ఇవ్వండి'శీర్షిక ప్రచురితమైన కథనానికి దశల వారీగా దాతలు స్పందిస్తున్నారు. గంగదేవిపాడు గ్రామానికి చెందిన లంబాడా ఫౌండేషన్ నాయకుడు మాళోతు రాధాకృష్ణ, సబ్‌రిజిస్ట్రార్ బాణోతు జగన్.. బాలుడి పరిస్థితిని వారి స్నేహితులకు తెలిపి వారి నుంచి ఆర్థిక సాయం కోరారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు ఇస్లావత్ స్వామినాయక్, ప్రసన్నరాణి దంపతులు రూ.25 వేలతో పాటు ఎన్టీఆర్ జిల్లా నుంచి పలువురు దాతల నుంచి రూ.1.81 లక్షలను సమకూర్చారు. మండలానికి మల్లెల నరసింహారావు, జడల నరసింహారావు, శ్రావణ్‌కుమార్, జి.సతీశ్, ఇమ్మడి వెంకటేశ్వరరావు తలా రూ.5 వేలు అందించారు. అంతకు ముందు దుబాయ్ వారధి ఫౌండేషన్ సభ్యులు రూ.91,116 అందించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

యువకుడు దుర్మరణం



రాంబాబు (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వీరప్రసాద్

వైరారూరల్: ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటన సోమవారం మండలంలోని తాటిపూడి గోదాముల వద్ద చోటుచేసుకుంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న మల్లారపు రాంబాబు (34) అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ శాఖమూరి వీరప్రసాద్ కథనం మేరకు.. వైరా నుంచి మధిర వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న రాంబాబును మధిర నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొట్టింది. దీంతో రాంబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రాంబాబు ఫారెస్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడని భావించిన పోలీసులు.. ఆ శాఖ నుంచి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. అయితే, ఫారెస్ట్ అధికారులు తమ శాఖలో రాంబాబు పేరుతో ఎవరూ లేరని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న బంధువులు కూడా ఫారెస్ట్ ఉద్యోగి అని చెప్పినప్పటికీ ఎక్కడ పని చేస్తున్నది స్పష్టంగా చెప్పలేకపోయారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వైరా ఎస్‌ఐ శాఖమూరి వీరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం గ్రామానికి చెందిన కోయ రవి (46) సోమవా రం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. రవి తన కూతురు వివాహం చేయగా రూ.10లక్షలు అప్పు అయింది. అప్పటి నుంచి అప్పు ఎలా తీర్చాలోనని మదన పడుతుండేవాడు. కుటుంబ సభ్యులు ధైర్యం చెప్పినా కూడా మనోధైర్యం కోల్పోయా డు. భార్య, కుమారుడు బయటకు వెళ్లగా రవి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొన్నాడు. బయటి నుంచి ఇంటికి వచ్చిన భార్య చూడగా ఉరివేసుకొని ఉన్నాడు. వెంటనే అతడిని వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యు లు తెలిపారు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

అత్తకు విషమిచ్చిన కోడలు

ఖమ్మంరూరల్: మండలంలోని ఓ గ్రామంలో అత్తకు కోడలు ఆహారంలో విషమిచ్చినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. మూడు రోజుల కిందట అత్తకు అన్నం పెట్టే సమయంలో అందులో విషం కలిపినట్లు తెలిసింది. ఆహారం తిన్న తర్వాత కొద్దిసేపటికి అత్త వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో సోమవారం విషయం బయటకు పొక్కింది. అత్తను హతమార్చడానికి చేసిందా? లేక ఆహారంలో పొరబాటున విషం కలిసిందా అనేది తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా...

'జగనన్నకు చెబుదాం' @1902

నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: సంతృప్త స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలందించడమే లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం శ్రీకారం చుట్టనున్నారు. క్యాంపు కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభిస్తారు. 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం కోసం ప్రత్యేకంగా 1902 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి వినతి పరిష్కారమయ్యే వరకూ ట్రాకింగ్ చేస్తారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను పొందడంలో ఎలాంటి సమస్యలున్నా తెలియచేయవచ్చు. సంక్షేమ పథకాలు, వైఎస్సార్ పెన్షన్ కానుక, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ సేవలు పొందడంలో ఏమైనా అవాంతరాలు ఎదురైతే రైతన్నలు, అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, మరెవరైనా సరే ఫిర్యాదు చేయవచ్చు. రెవెన్యూ రికార్డులకు సంబంధించి ఏమైనా సమస్యలున్నా, ప్రభుత్వ సేవలకు సంబంధించి మరే ఇతర ఇబ్బందులున్నా జగనన్నకు చెబుదాం ద్వారా పరిష్కారం కోసం 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ ద్వారా పౌరులు ఎప్పటికప్పుడు తమ ఫిర్యాదుల స్థితి, పరిష్కారం గురించి తెలుసుకునే వీలుంది. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లతో పాటు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తుంది.

ప్రజా సమస్యలపై పోరుకు సిద్ధంకండి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'ఇంటింటికీ సీపీఐ'పాదయాత్రలో తమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను క్రోడీకరించి, వాటి పరిష్కారానికి పోరాటాలకు సన్నద్ధం కావాలని పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, సాక్షాత్తూ ప్రధాని మోదీ 'జై బజరంగ్‌దళ్' అంటూ ఓట్లు వేయాలని మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సర్దుబాటు అంశాన్ని పక్కన పెట్టి, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను అధ్యయనం చేయాలని, వాటి పరిష్కారానికి పోరాడాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం సాంకేతిక కారణాలను చూపుతూ సీపీఐ జాతీయ హోదాను ఉపసంహరించడంపై మండిపడ్డారు.

సూపర్ స్పెషాలిటీగా ఆర్టీసీ ఆస్పత్రి

నేటి నుంచి సేవలు, 'నిమ్స్' ఫీజుల వర్తింపు

- కొత్తగా 16 బెడ్ల ఐసీయూ, నాలుగు ఆపరేషన్ థియేటర్లు
- త్వరలో సర్జికల్ ఐసీయూ అందుబాటులోకి
- ఆర్టీసీ ఉద్యోగులే కాకుండా సాధారణ రోగులకూ వైద్య సేవలు



సాక్షి, హైదరాబాద్: ఇంతకాలం సంస్థ ఉద్యోగులకే పరిమితమైన తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రి సాధారణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అవతరించింది. ఇటీవలే సాధారణ ప్రజల(ఆర్టీసీ ఉద్యోగులు కానివారు)కు ఔట్ పేషెంట్లుగా చికిత్స ప్రారంభించిన ఆర్టీసీ.. ఇప్పుడు సూపర్ స్పెషాలిటీ సేవలతో ముందుకొచ్చింది. ఇందుకోసం 16 పడకలతో కూడిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను సిద్ధం చేసింది. నాలుగు ఆపరేషన్ థియేటర్లను కూడా కొత్తగా ఏర్పాటు చేసుకుంది. వీటిని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మంగళవారం ఉదయం ప్రారంభించనున్నారు.

ఏడు ఆపరేషన్ థియేటర్లు..

గతంలో అత్యవసర వైద్య సేవలు అందించే పరిస్థితి లేకపోవటంతో ఇక్కడికి వచ్చే రోగులను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేసేవారు. ఆ స్థితి నుంచి క్రమంగా కీలక చికిత్సలు, అత్యవసర ఆపరేషన్లు చేసే స్థాయికి తార్నాక ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం మూడు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. కొత్తగా మరో నాలుగు ఆపరేషన్ థియేటర్లను సిద్ధం చేశారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ భవనంపై కొత్తగా ఐసీయూ బ్లాక్‌ను నిర్మించారు. ఇందులో 16 బెడ్లు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులే కాకుండా సాధారణ ప్రజలకూ ఇందులో చికిత్స అందిస్తారు. నిమ్స్ తరహాలో తక్కువ చార్జీలు వసూలు చేయనున్నారు. రోజుకు రూ.3 వేలు, అంతకంటే తక్కువే వసూలు చేయనున్నట్టు సమాచారం.

త్వరలో సర్జికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్..

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆధునిక వసతులతో ఉండే సర్జికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను కూడా ఆర్టీసీ ఆసుపత్రిలో సిద్ధం చేశారు. త్వరలో దీన్ని వినియోగంలోకి తేనున్నారు. ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ ప్రారంభించిన తర్వాత, ఎస్ఐసీయూ బ్లాక్‌లో ఫ్యూమిగేషన్ చేసి, బ్యాక్టీరియా కల్చర్ పరీక్షలు నిర్వహించి నెగెటివ్ రిపోర్టు వస్తే వెంటనే దాన్ని అందుబాటులోకి తెస్తారని సమాచారం. సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందిన వారు, కీలక ఆపరేషన్లు చేయించుకున్న రోగులు.. కొంతకాలం ఐసీయూలో ఉండాల్సి వస్తే ఇందులో ఉంచుతారు. వార్డులో ఓవైపు దీన్ని కొత్తగా ఏర్పాటు చేశారు.

ఇక ప్రతి డిపోలో హెల్త్ వాలంటీర్లు..

ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి వారి హెల్త్ హిస్టరీతో కూడిన రికార్డులను సిద్ధం చేశారు. గుండె సమస్యలు, ఇతర తీవ్ర ఆరోగ్య ఇబ్బందులతో బాధపడుతున్నట్లు గుర్తించిన ఉద్యోగులకు ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తూ, వారు క్రమపద్ధతిలో మందులు వాడేలా చూస్తున్నారు. గుండె సంబంధిత సమస్యలున్నాయని తేలిన 278 మంది ఉద్యోగుల్లో ఇద్దరు మందుల వాడకంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కొద్ది రోజుల్లోనే వారు మృతి చెందారు. ఇలాంటి పరిస్థితి మిగతావారికి రావద్దనే ఉద్దేశంతో ప్రతి డిపోలో సుశిక్షితులైన ఇద్దరు హెల్త్ వర్కర్లను నియమించాలని ఆర్టీసీ నిర్ణయించింది. వీరు ఉద్యోగులకు ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించడంతో పాటు వారి హెల్త్ హిస్టరీ ఆధారంగా మందులు వాడేలా చూస్తారు.

అలాగే వీరి వద్ద డిజిటల్ బీపీ చెకింగ్ యంత్రాలుంటాయి. వాటి ద్వారా బీపీని మానిటర్ చేస్తుంటారు. ఉద్యోగులకు సీపీఆర్‌పై శిక్షణ ఇస్తారు. ఇప్పుడు ఈ హెల్త్ వర్కర్లకు శిక్షణ ప్రారంభించనున్నారు.

కేసీఆర్‌కు వారమే గడువు..

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయకపోతే అడ్డుకుంటాం: బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: ''సీఎం కేసీఆర్‌కు వారం గడువిస్తున్నాం. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటకు కట్టుబడి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్‌ల)ను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి. లేనిపక్షంలో వారితో కలిసి సీఎం సహా మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటాం. ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చేదాకా ఉద్యమాన్ని కొనసాగిస్తాం...అవసరమైతే న్యాయపరమైన చర్యలకూ వెనుకాడబోం'అని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ హెచ్చరించారు. 'జేపీఎస్‌లు భయపడొద్దు... ఉద్యోగాల నుంచి తొలగిస్తే ఇంట్లోనే ఉండండి. కార్యదర్శుల పక్షాన బీజేపీ ఉద్యమిస్తుంది. కేసీఆర్ ప్రభుత్వం కొనసాగేది మరో 5 నెలలే. ఆ తరువాత బీజేపీ అధికారంలోకి వస్తుంది. తొలగించిన ఉద్యోగులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకుంటాం'అని ఆయన భరోసానిచ్చారు. ఈ మేరకు బండి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని 11 రోజులుగా సమ్మె చేస్తున్న జేపీఎస్‌లను ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేయడాన్ని ఖండించారు. 'జేపీఎస్‌లు చేసిన తప్పేంది? నాలుగేళ్లపాటు ప్రొబేషనరీ పీరియడ్‌ను పూర్తి చేశారు. అయినప్పటికీ నేటికీ వారిని రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయం. వీళ్లంటే కేసీఆర్ కు ఎందుకంత కక్ష? కేసీఆర్ కుటుంబానికి లంచాలు ఇవ్వలేదేమో.. పైసలిస్తే ఈపాటికే రెగ్యులరైజ్ చేసేవాళ్లేమోననే అనుమానం కలుగుతోంది'అని పేర్కొన్నారు. 'కేసీఆర్ అహంకారంవల్ల ఇప్పటికే వీఆర్వో వ్యవస్థ సర్వనాశనమైంది. 23 వేల మంది ఆర్టిజన్లు సమ్మె చేసి దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. 22వేల మంది స్కావెంజర్ల జీవితాలను రోడ్డున పడేశారు'అని ఆ ప్రకటనలో ధ్వజమెత్తారు.

విధుల్లో చేరకుంటే వేటే!

▶ మొదటి పేజీ తరువాయి

సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం నోటీసు జారీ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయడం అంటూ ఉండదని, ప్రభుత్వం నియమించిన కమిటీ.. సంతృప్తికరమైన పనితీరు, నైపుణ్యాలు ఉన్నాయని గుర్తించిన వారిని మాత్రమే క్రమబద్ధీకరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. జేపీఎస్‌లు సంఘంగా ఏర్పడటమే కాకుండా, చట్ట విరుద్ధంగా గత నెల 28 నుంచి సమ్మెకు దిగారని, ఈ కారణంగా సర్వీసులో కొనసాగే హక్కును జేపీఎస్‌లు కోల్పోయారని పేర్కొన్నారు. అయినప్పటికీ ఓ చివరి అవకాశం ఇవ్వాలని నిర్ణయించామని, మంగళవారం సాయంత్రం 5 గంటల్లోగా విధుల్లో చేరాలని ఆదేశిస్తున్నామని తెలిపారు.

సమ్మె కొనసాగింపునకే మొగ్గు..

సమ్మెను కొనసాగించాలా వద్దా? అన్న దానిపై అన్ని జిల్లాల కమిటీలతో సంఘం నేతలు సోమవారం రాత్రి పొద్దుపోయే దాకా గూగుల్ మీట్‌లో చర్చించారు. ఈ సందర్భంగా తమను సర్వీసుల నుంచి టర్మినేట్ చేసినా సమ్మె కొనసాగించేందుకే మొగ్గు చూపుతున్నట్టు పలువురు జేపీఎస్‌లు తెలిపారు. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వం నుంచి కచ్చితమైన తేదీతో కూడిన హామీ లభిస్తేనే సమ్మె విరమిస్తామని జేపీఎస్‌ల సంఘం ప్రకటించింది. అన్ని జిల్లాల అధ్యక్షులు సమ్మె కొనసాగించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కాగా మంగళవారం ఎవరికైనా టెర్మినేషన్ నోటీసు వస్తే తీసుకోకూడదని సమావేశంలో తీర్మానించారు. గత ఒప్పందం మేరకు పలువురు జేపీఎస్‌లు విధుల్లో చేరే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీలకుగాను దాదాపు మూడు వేలమంది పర్మనెంట్ ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శులు మినహాయించి దాదాపు 9,350 మంది జేపీఎస్‌లు (ఔట్‌సోర్సింగ్ వెయ్యి మందితో కలిపి) సమ్మెలో ఉన్నారు.

'టీఎస్‌పీఎస్సీ లీకేజ్' కేసులో మరో ఇద్దరు అరెస్టు

- ప్రవీణ్ నుంచి ఏఈఈ, ఏఈ పేపర్లు తీసుకున్న ద్వయం
- ఏడుగురు అభ్యర్థులకు రూ.10 లక్షల చొప్పున విక్రయం

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ లీకేజ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రవీణ్ కుమార్ నుంచి ఏఈఈ, ఏఈ పరీక్ష పత్రాలను తీసుకుని పలువురికి విక్రయించిన ఇద్దరు దళారులు వరంగల్‌కు చెందిన మనోజ్‌కుమార్‌రెడ్డి, హైదరాబాద్ వాసి మురళీధర్‌రెడ్డిలను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ప్రవీణ్ స్నేహితులైన వీరిద్దరూ పరీక్ష పత్రాలను హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురిని విక్రయించారు. ఒక్కో పేపర్ రూ.10 లక్షల చొప్పున అమ్మి కొందరి నుంచి మొత్తం, మరి కొందరి నుంచి అడ్వాన్సులు తీసుకుని మొత్తంగా నగదురూపంలోనే ప్రవీణ్‌కు అప్పజెప్పారు. ఈ కారణంగానే ప్రవీణ్ బ్యాంకు ఖాతాలో ఈ నగదుకు సంబంధించిన లావాదేవీలు కనిపించలేదు. అయితే అనుమానం వచ్చిన సిట్ ఫోన్ కాల్స్ వివరాలు ఆరా తీయగా మనోజ్, మురళీ పేర్లు వెలుగులోకి వచ్చాయి. వీరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా విషయం బయటపెట్టారు. కాగా, వీరి నుంచి పేపర్లు ఖరీదు చేసిన ఏడుగురి కోసం గాలిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి ఆ ఏడుగురిలో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మిగిలిన ముగ్గురి కోసం వేట కొనసాగిస్తున్న సిట్ మనోజ్, మురళీలను కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించింది. కాగా, ఈ ఇద్దరి అరెస్టులతో కలిపి ఈ కేసులో ఇప్పటి వరకు కటకటాల్లోకి చేరిన వారి సంఖ్య 24కు చేరింది.

త్వరలో 'ఆదర్శ' ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: ఆదర్శ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదలపై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సానుకూలంగా స్పందించినట్టు పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ తెలిపారు. మంత్రిని వారు సోమవారం కలిసి, పదేళ్లుగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలకు నోచుకోలేదని వివరించారు. వారం రోజుల్లో ఇందుకు సంబంధించిన షెడ్యూల్ జారీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు పీఆర్‌టీయూటీఎస్ నేతలు తెలిపారు.

శరత్‌చంద్రారెడ్డి మధ్యంతర బెయిల్ పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో శరత్‌చంద్రారెడ్డికి సీబీఐ ప్రత్యేక కోర్టు మధ్యంతర బెయిల్‌ను ఈ నెల 16 వరకూ పొడిగించింది. గతంలో మంజూరు చేసిన షరతులతో కూడిన బెయిల్ సమయం ముగియడంతో.. ఈ అంశంపై సోమవారం జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ ధర్మాసనం విచారించింది. భార్య అనారోగ్యం రీత్యా మధ్యంతర బెయిల్ కోరుతూ శరత్‌చంద్రారెడ్డి దాఖలు చేసిన పిటిషన్, వైద్య పత్రాల తనిఖీ నివేదికపై ఈడీ కౌంటర్ ఇవ్వాల్సి ఉంది. కానీ వైద్యపరమైన కారణాలతో శరత్‌చంద్రారెడ్డికి హైకోర్టు రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. ఆ ఉత్తర్వులు హైకోర్టు ఇంకా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదు. ఈ నేపథ్యంలో పరిణామాలు దృష్టిలో ఉంచుకొని శరత్‌చంద్రారెడ్డికి గతంలో షరతులను వర్తింపజేస్తూ మధ్యంతర బెయిల్‌ను ఈ నెల 16 వరకూ పొడిగిస్తున్నామని.. ఈలోగా హైకోర్టు ఉత్తర్వు ప్రతి అందజేస్తే స్వీకరిస్తామని స్పష్టం చేస్తూ జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

1331 ఉద్యోగాల క్రమబద్ధీకరణపై హర్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని ఏడు విభాగాల్లో 1,331 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో టీఎన్‌జీఓ అధ్యక్షుడు ఎం.రాజేందర్, హెచ్–1 యూనియన్ అధ్యక్షుడు కె.సాయిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, ఆర్థిక, వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు ఉద్యోగులు పాలాభిషేకం చేశారు. సీఎం తీసుకున్న నిర్ణయంతో తమ శాఖ మరింత బలోపేతమైందని, వైద్య సేవలు మరింత విస్తృతంగా ప్రజలకు అందించేందుకు ఉద్యోగులు కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలోవైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగ సంఘ నాయకులు జి.రాజశేఖర్, మంచాల రవీందర్, లాలు, రామారావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఉద్యోగ సంఘం నేతలు

జిల్లా వార్తలు

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతకు రశీదు అందజేస్తున్న ఏఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి భద్రాచలానికి చెందిన శ్రీ వెంగమాంబ ఏజెన్సీస్ యజమాని పరిమి సుబ్బారావు సోమవారం విరాళం అందజేశారు. రూ.1,01,116 నగదును ఆలయ అధికారులకు ఇవ్వగా వారు రశీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు, ఏఈఓ భవాని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి..

- కుమార్తెతో కలిసి వృద్ధురాలి నిరసన



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన నారాయణమ్మ, ఆదిలక్ష్మి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో ఎన్ని సార్లు వినతిపత్రాలు ఇచ్చినా న్యాయం జరగడం లేదని, నాకు న్యాయం చేయండని కుమార్తె ఆదిలక్ష్మితో కలిసి దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామవాసి అన్నె నారాయణమ్మ (76) ప్లకార్డు చేతపట్టుకుని కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన చేపట్టింది. వారసత్వంగా సంక్రమించిన 6 ఎకరాల భూమికి పాస్ పుస్తకం ఇప్పించాలని అభ్యర్థిస్తున్నా న్యాయం జరగడం లేదని విలేకరులకు తెలిపింది. విషయం తెలుసుకున్న పాల్వంచ పోలీస్ యంత్రాంగం కలెక్టరేట్‌కు చేరుకుని సముదాయించే ప్రయత్నం చేసినా వినిపించుకోకుండా న్యాయం జరిగేంత వరకు కదిలేది లేదని భీష్మించుకుని కూర్చుంది. ఈ విషయమై ఐడీఓసీ అధికారులను వివరణ కోరగా ప్రజావాణిలో కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే విచారిస్తామని చెప్పారని తెలిపారు. నారాయణమ్మ కుమార్తె ఆదిలక్ష్మి మాట్లాడుతూ తమను ఎవరూ పట్టించుకోవడం లేదని న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తామని చెప్పింది.

తునికాకు.. సేకరణ ఏ మేరకు?



సేకరించిన తునికాకును కట్టలుగా కడుతున్న గిరిజనులు

భద్రాద్రి జిల్లాలోని ఆరు డివిజన్లలో తునికాకు సేకరణ లక్ష్యం వివరాలు

డివిజన్	సేకరణ లక్ష్యం (స్టాండర్డ్ బ్యాగ్‌లు)
ఇల్లెందు	10,600
భద్రాచలం	9,700
మణుగూరు	5,400
పాల్వంచ	2,300
కిన్నెరసాని (వైల్డ్‌లైఫ్)	3,200
కొత్తగూడెం	3,900

మొదలైన అటవీ శాఖ లక్ష్యం

- ఉదయమే పిల్లాపెద్దల అడవి బాట
- ఆపై యాభై ఆకులు కట్టగా కల్లాల్లో అప్పగింత
- ఈ ఏడాది 64.70వేల స్టాండర్డ్ బ్యాగుల సేకరణే లక్ష్యం

పాల్వంచరూరల్: గిరిజనులు వేసవి పంటగా భావించే తునికాకు సేకరణ మొదలైంది. భద్రాద్రి సర్కిల్ పరిధిలో ఈ ఏడాది 64,700 స్టాండర్డ్ బ్యాగుల సేకరణను అటవీ శాఖ లక్ష్యంగా నిర్దేశించారు. అయితే, గత నెలాఖరు నుంచే మొదలుకావాల్సిన తునికాకు సేకరణ అకాలవర్షాల కారణంగా ఆలస్యమైంది. జిల్లాలోని పాల్వంచ, వైల్డ్‌లైఫ్ డివిజన్ పరిధిలోని యూనిట్లలో తునికాకు సేకరణ ప్రస్తుతం చురుగ్గానే కొనసాగుతోంది.



కల్లాల్లో ఆరబెట్టిన తునికాకు

కుటుంబాలతో సహా సేకరణ..

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన కుటుంబాలు పిల్లలు, వృద్ధులతో కలిసి ఉదయమే అడవి బాట పడుతున్నారు. తాగు నీరు, భోజనంతో సహా వెళ్తున్న వారు వేకువజాము నుంచి గుట్టలు, పుట్టలు తిరిగి తునికాకు సేకరించి ఇంటికి వస్తున్నారు. పాఠశాలలకు సెలవులు ఉండడంతో చిన్నారులు కూడా తల్లిదండ్రుల వెంట వెళ్లి ఆకు సేకరణలో సహకరిస్తున్నారు. మూటలు, బస్తాల్లో నింపుకుని తీసుకొస్తున్న తునికాకును 50 ఆకుల కట్టలుగా కట్టి యూనిట్లలోని కల్లాల్లో అప్పగిస్తారు. ఇలా కిన్నెరసాని అభయారణ్యంలోని గిరిజనులు నిత్యం తునికాకు సేకరణలో నిమగ్నమవుతున్నారు.



తునికాకుతో ఇంటికి వస్తున్న దృశ్యం

ధర పెంచితే బాగు..

ప్రస్తుతం ఉపాధి హామీ పనులకు వెళ్తే రోజుకు రూ.272 కూలి దక్కుతుంది. అయితే, తునికాకు సేకరణకు వెళ్తున్న వారికి మాత్రం ఫలితం ఉండడం లేదు. మండుటెండలో అడవిలోకి వెళ్లి సేకరించి తీసుకొచ్చిన తునికాకు 50ఆకుల కట్టకు అతి తక్కువగా వస్తోంది. వన్యప్రాణుల భయంతోనూ ఆకు సేకరిస్తున్న తమకు కూలి పెంచాలని గిరిజనులు కోరుతున్నారు.

గిట్టుబాటు కావడం లేదు..



ఎండలో అడవిలో ప్రమాదకర పరిస్థితుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తునికాకు సేకరణ చేస్తున్న కూలీలకు ప్రస్తుతం ఇస్తున్న కూలి గిట్టుబాటు కావడంలేదు. ఉపాధి పనులకు వెళ్తే పూటకు రూ.272 అందుతున్నాయి. తునికాకు సేకరణ రోజంతా చేసినా అంత రావడం లేదు. ఇకనైనా 50 ఆకుల కట్టకు రూ.5 చొప్పున చెల్లించాలి.

– ముక్కటి జోగమ్మ, రేగులగూడెం

బోనస్ విడుదల చేయాలి..



గత ఐదారేళ్లుగా తునికాకు సేకరణ జరిపే కూలీలకు ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ ఇంతవరకు చెల్లించలేదు. తునికాకు సేకరణకోసం ఇంటిల్లిపాది ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు స్పందించి వెంటనే తునికాకు బోనస్‌ను చెల్లించి మమ్మల్ని ఆదుకోవాలి.

– ఈసం పుల్లయ్య

ప్రమాదవశాత్తు మరణిస్తే పరిహారం..



అటవీ ప్రాంతంలో తునికాకు సేకరించే సమయాన కూలీలు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షలు, అటవీ జంతువుల కారణంగా గాయపడితే రూ.5లక్షలు పరిహారం చెల్లించాలి. అలాగే, గతంలో మాదిరి అన్ని గ్రామీణ ప్రాంతాల్లో తునికాకు కల్లాలను విస్తృతంగా ఏర్పాటుచేయాలి. అప్పుడే ఎండలో కష్టపడే గిరిజనులకు లాభం జరుగుతుంది.

– పూనెం రమేష్, ప్రజాపంథా నాయకుడు

జాతీయ స్థాయిలో సీట్లు సాధించాలి

ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



గిరిజన విద్యార్థినులతో మాట్లాడుతున్న పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలం: ఐటీడీఏ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయిలో సీట్లు సాధించాలని పీఓ గౌతమ్ పొట్రు ఆకాంక్షించారు. భద్రాచలంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు బాగా ప్రిపేర్ కావాలని విద్యార్థులకు సూచించారు. జేఈఈలో క్వాలిఫై అయిన విద్యార్థులు నీట్, ఐఐటీతో పాటు ఎంసెట్‌లో సీట్లు సాధించేలా కోచింగ్‌ను ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గురుకులం ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ దేవదాస్, వసంత కుమారి, కృష్ణ, కనకయ్య, రెహానా, రాజేశ్వరి, అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ పంపులతో జీవనోపాధి..

గిరిజన యువతకు జీవనోపాధి కలిగేందుకు జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ పంపులను సక్రమంగా నడిపించాలని పీఓ గౌతమ్ పొట్రు అన్నారు. ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఆయన జీసీసీ డీఎం, మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ మండలాల్లో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులు లాభాల బాటలో పనిచేసేలా సొసైటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆదాయం పారదర్శకంగా ఉండేలా రికార్డులు, బ్యాంక్ ఖాతాలను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. గిరిజనులు సేకరించిన అటవీ ఫలాలను దళారుల ప్రమేయం లేకుండా నేరుగా జీసీసీకే విక్రయించేలా మేనేజర్లు అవగాహన కల్పించాలన్నారు. పెట్రోల్ పంపులను బాధ్యతగా నిర్వహించని సొసైటీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి సొసైటీలను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం విజయ్‌కుమార్, భద్రాచలం, మణుగూరు, దమ్మపేట, ఇల్లెందు, పాల్వంచ మేనేజర్లు దేవదాస్, నరసింహారావు, లక్ష్మాజి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు విద్యార్థులకు ఉపయోగపడాలి



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: గురుకుల కళాశాల, ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు గిరిజన విద్యార్థులకు ఉపయోగపడేలా, వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ఉండాలని ఐటీడీఏ ఏపీఓ, గురుకులం ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత యూనిట్ అధికారులకు అందజేసి అర్హతల మేరకు పరిష్కరించాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. అర్హులైన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందేలా చూడాలని చెప్పారు. పలు స్వయం ఉపాధి పథకాలకు గిరిజనులు అర్జీలు పెట్టుకున్నారని, వాటిని పరిశీలించి అర్హత గలవారికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ రమాదేవి, ఎస్‌ఓ సురేష్‌బాబు, ఏపీఓ(పవర్) మునీర్ పాషా, డీఎస్‌ఓ ప్రభాకర్‌రావు, అగ్రికల్చర్ ఏడీ భాస్కర్, హెచ్ఈఓ దుర్గయ్య, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఫుట్‌బాల్ శిబిరాలు

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్ణయించిన 14 కేంద్రాల్లో వేసవి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఈ.సెల్యూకాస్, కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి జూన్ 4 వరకు శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి శిబిరానికి నాలుగు ఫుట్‌బాల్స్, మెటీరియల్ ఉచితంగా అందిస్తామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, మణుగూరు, అశ్వాపురం, పాల్వంచ, కొత్తగూడెం, రుద్రంపూర్, ఇల్లెందు, ఖమ్మం జిల్లాలో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం, సెయింట్ మేరీస్ గ్రౌండ్, సత్తుపల్లి, వీ.వీ.పాలెం, కల్లూరు, జల్లేపల్లిలో శిబిరాలు కొనసాగుతాయని వివరించారు.

వికసించిన మే పుష్పం

'మే'పుష్పం సోమవారం విరబూసింది. అశ్వారావు పేటలోని సోమాని రాజారమేశ్ నివాసంలో రెండు మొక్కల్ని పెంచుతుండగా, ఇవీ రెండు కుడా ఒకే సారి విరబూశాయి. కాగా కల్లూరు కప్పలబంధం రోడ్‌లో అంగన్‌వాడీ టీచర్ పి సుబ్బలక్ష్మి ఇంట్లో కూడా మే పుష్పం వికసించింది.

– అశ్వారావుపేటరూరల్/కల్లూరు

